నేడు ఇంజినీరింగ్

# మాక్ సీట్ల కేటాయింపు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి నిర్వహించిన తొలివిడత కౌన్సెలింగ్‌లో శనివారం మాక్‌సీట్లు కేటాయించనున్నారు. రాష్ట్రంలోని 179 కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద విద్యార్థులకు 89వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎప్‌సెట్-26 కౌన్సెలింగ్ కోసం దాదాపు 94వేల మంది స్లాట్‌బుకింగ్ చేసుకున్నారు. సీట్ల కోసం 88వేల మంది అభ్యర్థులు ఆన్‌లైన్లో ఆప్షన్లు నమోదు చేశారు. షెడ్యూలు ప్రకారం ఈ నెల 4న మాక్‌సీట్ల కేటాయింపు జరుగుతుంది. అభ్యర్థికి వచ్చిన ర్యాంకు, కేటగిరీ, రిజర్వేషన్ ఆధారంగా ప్రాథమికంగా ఏ కళాశాల, ఏ కోర్సులో సీటు వస్తుందో తెలుస్తుంది. ప్రాథమిక అంచనా ప్రకారం వచ్చే అవకాశమున్న సీటు నచ్చకున్నా, ఇతర కళాశాలలో మెరుగైన సీటు కోరుకుంటే ఆప్షన్లను పునఃసమీక్షించుకుని ప్రాధాన్య క్రమాన్ని మార్చుకోవచ్చు. ఈ పునస్సమీక్ష కోసం ఈ నెల 5 నుంచి 7 వరకు అవకాశం ఉంటుంది. ఒకవేళ అభ్యర్థి ప్రాథమిక సీట్ల కేటాయింపులో మార్పులు అవసరం లేదని భావిస్తే తొలుత ఇచ్చిన ఆప్షన్లనే పరిగణనలోకి తీసుకుని సీట్లు కేటాయిస్తారు. తొలివిడత సీట్ల కేటాయింపు ఈ నెల 10న వెల్లడిస్తామని, ప్రవేశాలకు 14 తుది గడువుగా ఉంటుందని ఇప్పటికే షెడ్యూలులో తెలిపారు.

## కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల పరీక్షకు 91.97 శాతం మంది హాజరు

- అప్‌లోడింగ్ సమస్యతో గంట ఆలస్యంగా ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి జేఎన్‌టీయూలో శుక్రవారం నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షకు 91.97శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. 67 పోస్టులకు 349 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 321మంది పరీక్ష రాశారు. రెండు సెషన్లలో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం సెషన్‌లో కొన్ని సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు సమయానికి ప్రారంభం కాలేదు. 11 గంటలకు ప్రారంభం కావాల్సిన పరీక్షలు 12గంటలకు ప్రారంభమైనట్లు సమాచారం. ప్రశ్నాపత్రాలు నిర్దేశిత సైజు కన్నా పెద్దగా ఉండడంతో అప్‌లోడింగ్‌కు ఎక్కువ సమయం పట్టిందని సిబ్బంది చెబుతున్నారు. పరీక్షలు ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ అభ్యర్థులకు నష్టం జరగకుండా 100 నిమిషాల సమయం ఇచ్చామని అధికారులు పేర్కొన్నారు. 1:3 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు అర్హులయ్యారు. సుమారు 200మంది అభ్యర్థులకు శనివారం ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.